సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



సకల వసతులతో సర్కారు బడి

రామన్నపేట మండలంలోని జనంపల్లి ప్రాథమిక పాఠశాల కార్పొరేట్ స్కూల్‌ను తలపిస్తోంది.

- 9లో



పేరుకే క్రీడా ప్రాంగణాలు

చాలా చోట్ల తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయలేదు. ఏర్పాటు చేసిన చోట సౌకర్యాలు సరిగా లేవు.

- 9లో

గరిష్టం/కనిష్టం
41°/26°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది.



నృసింహుడికి లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలోని ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పుష్పాలతో పూజలు చేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య కైంకర్యాలు చేపట్టారు. వేకువజామున సుప్రభాతం, ఆరాదన, అర్చనలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రథ మ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, గజవాహనసేవ, బ్రహ్మోత్సవం, వెండిజోడు సేవలు వైభవంగా నిర్వహించారు.



ఉత్సవమూర్తులకు పుష్పార్చన చేస్తున్న ఆచార్యులు



ఆలయ తిరువీధిలో బారులుదీరిన భక్తులు

పెద్దమునిగల్‌లో ఓపెన్ ఎయిర్ జైల్

దేవరకొండ(చందంపేట) : నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండల పరిధిలోని పెద్దమునిగల్ శివారులో ఓపెన్ ఎయిర్ జైలు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆదివారం జైళ్ల శాఖ అధికారులు రెవెన్యూ యంత్రాంగంతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. 289 ఎకరాల్లో ఓపెన్ ఎయిర్ జైలు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించనున్నట్లు నల్లగొండ జైలు సూపరింటెండెంట్ దేవుల వెల్లడించారు. స్థలానికి సంబంధించిన వివరాలన్నీ సేకరించామని, కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట నేరేడుగొమ్ము మండల తహసీల్దార్ అరుణమ్మ, దేవరకొండ సబ్‌జైలు సూపరింటెండెంట్ హర్షవర్ధన్, ఎస్‌ఐ నరేష్, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు పురస్కారం



మంత్రి చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి టౌన్ : వ్యక్తిగత గార్డెనింగ్ విషయంలో కలెక్టర్ పమేలా సత్పతికి రాష్ట్ర ప్రభుత్వం పురస్కారం అందజేసింది. హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన 'గార్డెన్ ఫెస్ట్ – 2023' కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీ అందుకున్నారు. కలెక్టర్ బంగ్లాలో సేంద్రియ పద్ధతుల్లో సుందరీకరణ, టెర్రస్ గార్డెనింగ్, కిచెన్ గార్డెనింగ్, వివిధ రకాల పూల మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఇందుకు గాను పురస్కారానికి ఎంపికయ్యారు.

ఇడెం శ్రీనివాస్ దంపతులకు నంది అవార్డు



అవార్డు ప్రదానం చేస్తున్న దైవజ్ఞశర్మ

రామన్నపేట : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన ఇడెం శ్రీనివాస్–రాధ దంపతులకు వల్లూరి ఫౌండేషన్‌వారు జాతీయ బంగారు నంది అవార్డు ప్రదానం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనలో సంస్థ చైర్మన్ వీఆర్ శ్రీనివాసరాజు, దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇడెం స్వరూప స్మారకట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను అవార్డు దక్కినట్లు శ్రీనివాస్ తెలిపారు. అలాగే ఇడెం శ్రీనివాస్ రూపొందించిన ఓ నేతన్నకథ సీడీని ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి ఆవిష్కరించారు.

24, 25 తేదీల్లో ఐద్వా రాష్ట్ర కమిటీ సమావేశాలు



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

యాదగిరిగుట్ట : ఐద్వా రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈనెల 24,25 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. ఆదివారం యాదగిరిగుట్టలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. కేంద్రం బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. మహిళా హక్కులకు రక్షణ కరువైందన్నారు.కేంద్రం అవలంభిస్తున్న విధానాలపై ఐద్వా సమావేశాల్లో చర్చించి పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. సమావేశాలకు జాతీయ సహాయ కార్యదర్శి సుధా సుందర్‌రామన్, జాతీయ కోశాధికారి పుణ్యవతి హాజరుకానున్నారని, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆమె వెంట ఐద్వా జిల్లా కార్యదర్శి భట్టుపల్లి అనురాధ ఉన్నారు.

ఒలింపిక్స్‌లో ప్రథమ స్థానం



మెడల్ చూపుతున్న పంజాల శివమణి

బీబీనగర్ : మండలంలోని కొండమడుగు గ్రామానికి చెందిన పంజాల శివమణి ఢిల్లీలో జరిగిన 2022–2023 స్టూడెంట్స్ నేషనల్ ఒలింపిక్స్ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నలిచాడు. శివమణి ఘట్‌కేసర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు.

ఎట్ల నడుస్తున్నయ్!

బీఆర్‌ఎస్ సమ్మేళనాలపై ఇంటెలిజెన్స్ ఆరా!

- నమ్మతి, అనమ్మతిపై ప్రత్యేక దృష్టి
- ముఖ్యనేతల గైర్హాజరుపై ఫీడ్ బ్యాక్
- కార్యకర్తల అభిప్రాయాల సేకరణ
- ప్రభుత్వ పథకాల అమలుతీరుపైనా ఆరా
- ఏరోజుకారోజు అధినేత కేసీఆర్‌కు నివేదిక



సాక్షి, యాదాద్రి : ఆత్మీయ సమ్మేళనాలు ఎలా జరుగుతున్నాయి.. ఎవరెవరు ఏం మాట్లాడుతున్నారు.. ముఖ్య నేతలంతా హాజరవుతున్నారా.. కార్యకర్తల నుంచి ఎటువంటి స్పందన లభిస్తోంది.. పథకాలపై ఏమంటున్నారు.. ఇటువంటి విషయాలపై ఆరా తీస్తున్నాయి ఇంటెలిజెన్స్ వర్గాలు. ఏరోజుకారోజు అధినేత కేసీఆర్‌కు నివేదికలు పంపుతున్నాయి. హ్యాట్రిక్‌పై కన్నేసిన ముఖ్యమంత్రి కేసీఆర్.. వచ్చే సాధారణ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా పార్టీ కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఆలేరు, భువనగిరి, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఈ సమ్మేళనాలకు క్షేత్రస్థాయి నుంచి కేడర్‌ను భారీగా సమీకరిస్తున్నారు. అయితే కొందరు జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు సరిగా హాజరు కావడం లేదు. వారు ఎందుకు రావడంలేదనే కారణాలపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. అంతేకాకుండా పార్టీలో నెలకొన్న పరిస్థితులు, నేతల తీరుపై పత్రికల్లో వచ్చే వార్తలతో పాటు ఆత్మీయ సమ్మేళనాలకు వస్తున్న కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తున్నారు.

ఎమ్మెల్యేల అధ్యక్షతన సమ్మేళనాలు

10 నుంచి 15 గ్రామాలను ఒక యూనిట్‌గా తీసుకొని పార్టీ కార్యకర్తలతో సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. పట్టణాల్లో పలు వార్డులను కలుపుకొని సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. సమ్మేళనాలకు జిల్లా స్థాయిలో మంత్రి జగదీశ్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఇక నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకుంటున్నారు. ఆలేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడిమహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పాల్గొంటున్నారు. భువనగిరిలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్ హాజరవుతున్నారు. మునుగోడునియోజకవర్గ పరిధిలోని చౌటుప్పల్ మున్సిపాలిటీ, చౌటుప్పల్ మండలం, సంస్థాన్ నారాయణపురం మండలాల్లో ఆత్మీయ సమ్మేళనాలు ఇంకా ప్రారంభం కాలేదు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని మోత్కూరు మున్సిపాలిటీ, మోత్కూరు మండలాల్లో ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అధ్యక్షతన సమ్మేళనాలు నిర్వహించారు.

కార్యకర్తల నుంచి ఫిర్యాదులు

ఆత్మీయ సమ్మేళనాలకు వస్తున్న పార్టీ కార్యకర్తల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయి. అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు రావడం లేదని, అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు వేయడం లేదని, రుణమాఫీపైనా బాహాటంగానే జిల్లా నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా స్థానిక నాయకత్వం తమను పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను గడగడపకు తీసుకెళ్లేలా పార్టీ శ్రేణులను బీఆర్‌ఎస్ నాయకత్వం సమాయాత్తం చేస్తోంది. అందుకోసం ఆత్మీయ సమ్మేళనాలను సద్వినియోగం చేసుకుంటుంది. ఇదే సమయంలో అసమ్మతి వాదులను బుజ్జగిస్తోంది.

మొక్కుబడిగా హాజరు

ఆత్మీయ సమ్మేళనాలకు కొందరు ముఖ్య నాయకులు మొక్కుబడిగా హాజరవుతున్నట్లు తెలుస్తోంది. సమావేశానికి వచ్చి సంతకం చేసి వెళ్లిపోతున్న వారిని ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తిస్తున్నట్లు సమాచారం. తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ మందుల సామేల్ ఆత్మీయ సమ్మేళనాల్లో కన్పించడం లేదు. మరికొందరు నేతలు కూడా సక్రమంగా హాజరుకావడం లేదు. మొత్తంగా ఆత్మీయ సమ్మేళనాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలను ఇంటెలిజెన్స్ అధికారులు నిశితంగా గమనిస్తూ ఎప్పటికప్పుడు పార్టీ అధిష్టానానికి నివేదిక అందజేస్తున్నట్లు తెలుస్తోంది.

పాత, కొత్త నాయకత్వం మధ్య పంచాయితీ!

పార్టీ ఆవిర్భావం నుంచి పని చేసిన వారికి, కొత్తగా చేరిన నాయకుల మధ్య బేదాభిప్రాయాలు ఉన్నట్లు ఇంటలిజెన్స్ వర్గాలు గుర్తించినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమం నుంచి పని చేసిన తమను కాదని ఇటీవల పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని పలువురు సీనియర్ నేతలు గుర్రుగా ఉన్నారు. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి, పార్టీ పరిశీలకుల ఎదుటే తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. అంతేకాకుండా మండల స్థాయిలో పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి తమకు సమాచారం ఇవ్వడం లేదని గ్రామస్థాయి నాయకులు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్తున్నారు.

యాదగిరిగుట్ట @ 43°

- ఆరెంజ్ జోన్ మండలాల్లో ఎండ తీవ్రత



నిర్మానుష్యంగా జగదేవ్‌పూర్ - భువనగిరి రోడ్డు

భువనగిరి టౌన్ : జిల్లాలో ఎండ తీవ్రంత కొనసాగుతోంది. ఆరెంజ్ జోన్‌లో ఉన్న 13 మండలాల్లో ఆదివారం కూడా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా యాదగిరిగుట్టలో 43 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రత రికార్డ్ అయ్యింది. భువనగిరితో పాటు ఇతర మండలాల్లోనూ 40 డిగ్రీలపైనే ఉంది. ఉదయం 9గంటల నుంచే భానుడు భగ్గుమంటున్నాడు. సాయంత్రం 5 దాటినా ఎండ వేడిమి తగ్గడం లేదు. ఆరెంజ్ జోన్‌లో ఉన్న మండలాల ప్రజలు మధ్యాహ్నం సమయంలో బయట తిరగవద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. రోజు కూలీలు, చిరువ్యాపారుల జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



ప్రచార జాతను ప్రారంభిస్తున్న గోద శ్రీరాములు

భువనగిరిటౌన్ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. ఇంటింటికి సీపీఐ ప్రచార జాతను ఆదివారం భువనగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భువనగిరి పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలు ఎంతోమంది ఉన్నారని పేర్కొన్నారు. అద్దె ఇళ్లలో ఉంటూ జీవనం సాగిస్తున్నారని, వారందరికీ ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. అదే విధంగా పట్టణానికి రూ.100 కోట్లు కేటాయించి అభివృద్ధి పరచాలని, కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయ్యాయని విమర్శించారు. ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏశాల అశోక్, సోమన సభిత, పుట్ట రమేష్, వస్తువుల అభిలాష్, చింతల మల్లేష్, దాసరి లక్ష్మయ్య, మరిపెల్లి రాములు, చొప్పరి సత్తయ్య, రాళ్లపల్లి హరికుమార్, దండు కాంతమ్మ పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ మార్చాలి



రైతులతో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

భువనగిరి : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం భువనగిరి మండలంలోని రాయగిరి, తుక్కాపురం, గౌసనగర్, ఎర్రంబెల్లి గ్రామాల్లో రీజనల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. చిన్న, సన్నకారు రైతులు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.నిర్వాసితులకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో రైతులు అవి శెట్టి పాండు,అనిల్, గడ్డమీది మల్లేశం,కరుణాకర్, రామకృష్ణారెడ్డి, హన్మంత్‌రెడ్డి, అయిలయ్య, భిక్షపతి, మహేందర్‌రెడ్డి,అర్జున్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ యాదగిరిగుట్టగా తీర్చిదిద్దుదాం



చెత్త సేకరణ ఆటోలు, వాటర్ ట్యాంకర్లను ప్రారంభిస్తున్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న యాదగిరిగుట్టను సమష్టి కృషితో స్వచ్ఛ యాదగిరిగుట్టగా తీర్చిదిద్దుకుందామని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నూతనంగా కొనుగోలు చేసిన చెత్త సేకరణ ఆటోలు, వాటర్ ట్యాంకర్లను ఆదివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రారంభించి మా ట్లాడారు. చెత్తను ఆటోల్లోనే వేయాలని, ఇళ్ల మధ్య, ఖాళీ స్థలాల్లో పడేయరాదని ప్రజలకు సూచించారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రోజూ పట్టణంలో పర్యటించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ గౌడ్, వైస్ చైర్మన్ కాటంరాజు, కౌన్సిలర్లు బూడిద సురేందర్, సీస విజయలక్ష్మీకృష్ణగౌడ్, మాలోతు సరోజహరీష్, దండబోయిన అనిల్, కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, సయ్యద్ బాబా, యండీ రిజ్వానా, ఇన్‌చార్జి కమిషనర్ పి.చక్రపాణి, మేనేజర్ నరేష్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, జూనియర్ అసిస్టెంట్ బాబు, ఇస్తారి పాల్గొన్నారు.

ప్రారంభానికి ముందే పగుళ్లు!

- డివైడర్ నిర్మాణంలో లోపాలు
- నాణ్యత పాటించకుండా పనులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



పగుళ్లు ఏర్పడిన డివైడర్

మోత్కూరు : సుందరీకరణలో భాగంగా మోత్కూరులో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం బయటపడుతోంది. టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో రహదారి విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్, డివైడర్లు ఏర్పాటు చేశారు. ప్రధాన రోడ్డు మధ్యలో ఆరు ఫీట్ల వెడల్పు, రెండున్నర నుంచి మూడు ఫీట్ల ఎత్తుతో 1.6కి.మీ దూరం డివైడర్ నిర్మిస్తున్నారు. భువనగిరి రోడ్డు నుంచి పనకబండ చౌరస్తా వరకు, అంబేద్కర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వరకు, నార్కట్‌పల్లి రోడ్డులో సబ్ రిజిస్ట్రార్ వరకు డివైడర్ల నిర్మాణం చేస్తూ సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులను పర్యవేక్షిస్తున్నారు. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా డివైడర్ల నిర్మాణం చేస్తుండటంతో మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. డివైడర్లకు వాటర్ క్యూరింగ్ సక్రమంగా చేయకపోవడం, సిమెంట్ సమపాళ్లలో కలపక పోవడం, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రారంభానికి ముందే బీటలు వారుతున్నాయి. గతంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పాత పద్మశాలి సంఘం, జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద డివైడర్లు దెబ్బతిన్నాయి. డివైడర్ పగిలిన వద్ద పూర్తి స్థాయిలో తొలగించకుండా మరమ్మతులు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. కొత్త బస్టాండ్ వద్ద డివైడర్ పెద్ద ఎత్తున పగుళ్లు పట్టింది. నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడం, ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా జరుగుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాలు ఢీకొంటే డివైడర్ ఉండే పరిస్థితి లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు కావడం, పర్సంటేజీలకే పరిమితం కావడంతో నిర్మాణం పనులు నాసి రకంగా కొనసాగుతున్నాయని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం



నాణ్యత పాటించకపోవడంతోనే ప్రారంభానికి ముందే డివైడర్ పగుళ్లు పట్టింది. ఫొటో తీసి వాట్సాప్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పర్సంటేజీలకే పరిమితమయ్యారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– బయ్యని రాజు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తుండు



డివైడర్ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత పాటించేలా పర్యవేక్షిస్తాం. అవసరమైతే బిల్లులు ఆపేస్తాం. వాటర్ క్యూరింగ్ సక్రమంగా కావడం లేదని తమ దృష్టికి వచ్చింది. కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– సి.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ మోత్కూరు

ప్రశాంతంగా గురుకుల పరీక్ష

- 834 మంది విద్యార్థులు హాజరు



భువనగిరిలోని గురుకుల పాఠశాలలో పరీక్ష రాయడానికి వస్తున్న విద్యార్థులు

భువనగిరి : జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9వ తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణకు భువనగిరి, వలిగొండలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష కొనసాగింది. 970 మంది విద్యార్థులకు గాను 834 మంది హాజరయ్యారు. 136 మంది గైర్హాజరయ్యారు. ఇందులో వలిగొండలోని మోడల్ స్కూల్‌లో 306 మంది విద్యార్థులకు 36, భువనగిరిలోని గురుకుల పాఠశాలలో 664 మందికి 564 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాళ్లు తెలిపారు. విద్యార్థులను ఉదయం 10 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతి ఇచ్చారు.

గుట్టలో వైభవంగా రాహు గాయత్రీ హవనం

యాదగిరిగుట్ట : పట్టణంలో అఖండ నామాశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అక్షయ సువర్ణ లక్ష్మీ నారాయణ మహాయజ్ఞం వైభవంగా సాగుతోంది. ఆదివారం ఆశ్రమ పీఠాధిపతి ప్రసన్న కృష్ణదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో అఖండ నామ సంకీర్తన నిర్వహించారు.ఈ సంకీర్తన నేడు ఉదయం 8గంటల వరకు కొనసాగనుంది. అలాగే రాహు గాయత్రీ హవనం చేపట్టారు. రాహుదోషం, దుర్గామాత అనుగ్రహం, సర్వ విజయ ప్రాప్తికోసం గాయత్రీ హవనం చేపట్టినట్లు కృష్ణదాస్ ప్రభూజీ పేర్కొన్నారు. వేడుకల్లో మాతా మధుమంజలీ, వీర ధర్మేంద్రస్వామిజీ, గణేష్ ప్రభు, వరంగల్, బచ్చన్నపేట, సూర్యాపేట, హైదరాబాద్ ప్రాంతాల సంకీర్తకులు పాల్గొన్నారు.



రాహు గాయత్రీ హవనం నిర్వహిస్తున్న పీఠాధిపతి కృష్ణదాస్ ప్రభూజీ, ఆశ్రమ నిర్వాహకులు

క్లుప్తంగా

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి : రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి పట్టణ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి–పగిడిపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఎస్టీ హాస్టల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఛాతి ఎడమ వైపు ఐ లవ్ యూ పుష్ప అని పచ్చబొట్టుతో ఉన్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు.

చెరువులో పడి బాలుడు మృతి

సూర్యాపేట క్రైం : చెరువులో పడి బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేటలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని మామిళ్లగడ్డకు చెందిన సుజాత కుమారుడు సాయితేజ(08) తమ్ముడు కళ్యాణ్‌శ్రీనివాస్‌తో కలిసి ట్యాంక్‌బండ్ సద్దుల చెరువు పైకి వచ్చారు. ఆడుకుంటూ సాయితేజ ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడ్డాడు. వెంటనే కళ్యాణ్‌శ్రీనివాస్ ఇంటికి వచ్చి తల్లికి సమాచారం అందజేశారు. చెరువు దగ్గరకు వెళ్లే సరికి అప్పటికే సాయితేజ మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దేవరకొండ (చందంపేట): అనుమతులు లేకుండా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని నేరేడుగొమ్ము పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దవూర నుంచి ఆదివారం తెల్లవారుజామున నేరేడుగొమ్ము మండల పరిధిలోని పోలేపల్లి వైపునకు బొలెరో వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో మండల పరిధిలోని తిమ్మాపురం వద్ద వాహనాన్ని తనిఖీ చేసి 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం వ్యాపారుల రిమాండ్

నాగార్జునసాగర్: ఆంధ్రా–తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో గల కొత్తబ్రిడ్జి మీదనుంచి తరలిస్తుండగా పోలీస్ చెక్‌పోస్టు వద్ద 9క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శనివారం రాత్రి సాగర్ పోలీసులు పట్టుకున్నారు. బియ్యం వ్యాపారులైన పలనాడు జిల్లా నర్సరావు పేటకు చెందిన నక్కబోయిన శ్రీనివాసరావు, ఓర్సుకోటేశ్వర్‌రావు, పిట్టల రవిశంకర్, బత్తుల కోటేశ్వర్‌రావు, బత్తులనాగరాజులను అరెస్ట్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి ఆదివారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలగిరి (తుంగతుర్తి) : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ బి.శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలోని బిక్కేరు వాగు శివారులోని వ్యవసాయ బోర్ల వద్ద ఇసుకను తీస్తుండగా స్థానిక రైతులు అడ్డుకున్నారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఇసుక ట్రాక్టర్లు పట్టుకొని కేసులు నమోదు చేశారు.

ప్రమాద తీవ్రత తగ్గించేలా..

- మార్కెట్‌లో కాంపోజిట్ సిలిండర్లు
- 5నుంచి 10 కేజీల చొప్పన అందుబాటులో..
- ప్రమాద తీవ్రత 80 నుంచి 90శాతం తక్కువగా ఉండేలా రూపకల్పన

కోదాడ: అనుకోని సంఘటనలో గ్యాస్ సిలిండర్ పేలితే జరిగే విధ్వంసం ఊహించలేనిది. ఇటీవల ఖమ్మం జిల్లాలో జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా పదుల సంఖ్యలో క్షతగాత్రులుగా మారిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు జరిగినపుడు ప్రాణనష్టం జరగకుండా ప్రమాద తీవ్రత అతి తక్కువగా ఉండే విధంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఇండేన్ గ్యాస్ విభాగం సరికొత్త టెక్నాలజీతో కాంపోజిట్ సిలిండర్లను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. ఐదు, పది కేజీల్లో లభించే ఈ సిలిండర్లు ఆధునిక టెక్నాలజీతో తయారు చేయడమే కాకుండా ప్రస్తుతం వాడే ఉక్కు సిలిండర్ల బరువులో సగానికి కన్నా తక్కువగా ఉండడం వీటి ప్రత్యేకత.

ఏమిటీ ఈ కాంపోజిట్ సిలిండర్లు

ప్రస్తుతం ఇంటి అవసరాలకు వాడే సిలిండర్లను ఉక్కుతో తయారు చేస్తుంటారు. ప్రమాదంలో ఇవి పేలితే ఆస్తి, ప్రాణ నష్టాలు అధికంగా ఉంటున్నాయి. వీటిని నివారించడానికి మూడు పొరలతో కూడిన సిలిండర్లను రూపొందించారు. వీటినే కాంపోజిట్ సిలిండర్లు అని పిలుస్తున్నారు. లోపలి పొరను బ్లో–మోల్డెడ్ హై–డెన్సిటీ పాలిథిలిన్ (హెచ్‌డీపీఈ) తయారు చేస్తారు. దీనిపైన ఫైబర్ గ్లాస్‌తో కూడిన రెండవ పొరను ఏర్పాటు చేశారు. వీటిని కప్పుతూ మూడవ పొరగా హెచ్‌డీపీఈతో తయారు చేసిన జాకెట్ ఉంటుంది. ప్రస్తుతం వాడే ఉక్కు సిలిండర్ల బరువులో సగానికి కన్నా తక్కువగా ఉండడంతో పాటు ప్రమాద తీవ్రత ఉక్కు సిలిండర్లతో పోల్చితే 80నుంచి 90 శాతం తక్కువగా ఉంటుందని కంపెనీ స్పష్టం చేస్తోంది.



ప్రమాదరహిత కాంపోజిట్ గ్యాస్ సిలిండర్లు

ప్రత్యేకతలు ఏమిటంటే...

అనుకోని సంఘటనలు జరిగినపుడు ప్రమాదాల తీవ్రతను 80నుంచి 90శాతం వరకు తగ్గించడంతో పాటు ఈ కాంపోజిట్ సిలిండర్లు అనేక ప్రత్యేకతలను కలిగి ఉన్నాయి. ఇవి పారదర్శకంగా ఉండడంతో సిలిండర్ లోపల ఎంత గ్యాస్ ఉంది, ఎంత అయిపోయింది తెలుసుకోవచ్చు. ఇవి తుప్పు పట్టవు ఇంటి లోపల మరకలు కావు. బరువు తక్కువగా ఉండడంతో ఒక చోటి నుంచి మరో చోటికి సులువుగా తీసుకుపోవచ్చు. ప్రస్తుతం ఇండేన్ గ్యాస్ డీలర్ల వద్ద ఈ సిలిండర్లు అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం ఇంటి అవసరాలకు వాడే సిలిండర్లో గ్యాస్ 14.2 కిలోలు ఉండగా కాంపోజిట్ సిలిండర్లలో 10 కేజీలు, 5 కేజీల పరిణామంలో లభ్యమవుతాయి. వీటిని కావాలంటే సెక్యూరిటీ డిపాజిట్‌గా 10కేజీల వాటికి 3500, 5కేజీల వాటికి 2200 చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉక్కు సిలిండర్లు వాడే వారు డిపాజిట్ వ్యత్యాసాన్ని చెల్లించి ఉక్కు సిలిండర్ల నుంచి కాంపోజిట్ సిలిండర్లకు మారవచ్చు. సాధారణ సిలిండర్ల వలె వీటిని కూడా హోం డెలవరీ చేస్తారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని డీలర్లు అంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రస్తుతం వాడే గ్యాస్ సిలిండర్ పేలితే ప్రాణ, ఆస్తినష్టం తీవ్రంగా ఉంటుంది. వాటి స్థానంలో ప్రస్తుతం నూతన టెక్నాలిజీతో తయారు చేసిన కాంపోజిట్ సిలిండర్లను ఉపయోగిస్తే ప్రమాద తీవ్రతను 80 నుంచి 90 శాతం వరకు తగ్గించవచ్చు. వినయోగదారులు ప్రస్తుత ఉక్కు సిలిండర్ల నుంచి కాంపోజిట్ సిలిండర్లకు సులువుగా మారే అవకాశాన్ని కంపెనీ కల్పించింది. విని యోగదారులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలి.

– కారింగుల అంజన్‌గౌడ్, ఇండేన్‌గ్యాస్ డీలర్, కోదాడ

దేశానికే రోల్‌మోడల్ తెలంగాణ

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: తెలంగాణ అభివృద్ధి దేశానికే రోల్ మోడల్ అని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు(ఎం) మండలం రాఘవపురం గ్రామానికి చెందిన బీజేపీ యువ మోర్చా మాజీ మండల అధ్యక్షుడు యర్కాల యతీశ్వర్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు గుండు అరుణ్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఝెల్ల బుచ్చిరెడ్డి, యర్కాల అంజయ్య, మారుపాక మచ్చగిరి, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గుండు సునీత, మారుపాక మానసలతో పాటు వివిధ పార్టీలకు చెందిన సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, ఆత్మకూరు(ఎం) మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, రైతుబంధు కన్వీనర్ యాసా ఇంద్రారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఉప్పలయ్య యాదవ్, రైతు బంధు జిల్లా సభ్యుడు భిక్షపతి, పార్టీ సెక్రటరీ జనరల్ వెంకటేష్‌గౌడ్, టీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సోలిపురం అరుణ, గ్రామశాఖ అధ్యక్షుడు బండ పురుషోత్తంరెడ్డి, ఎర్కల స్వామిగౌడ్ తదితరులున్నారు.



వివిధ పార్టీల నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

రెడ్డిగూడెంలో విషాదం





హైదరాబాద్‌లోని కుషాయిగూడలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో భార్యా, కుమారుడితో సహా సజీవ దహనమైన మద్దిరాల మండలం రెడ్డిగూడేనికి చెందిన నరేష్ ఇంటి వద్ద రోదిస్తున్న బంధువులు, గ్రామస్తులు

స్థల వివాదం.. ముగ్గురిపై పలువురి దాడి

చౌటుప్పల్ : ప్లాట్ పంచాయితీలో ఓ సామాజిక వర్గానికి చెందిన పలువురు మారణాయుధాలతో ముగ్గురిపై దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటన మండల పరిధిలోని తూప్రాన్‌పేటలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సీత పాండు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ గ్రామానికి చెందిన గందం రాజుకు మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామంలోని సర్వే నంబర్ 29లో 800గజాల స్థలం ఉంది. మూడేళ్లలో నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో తనస్థలం తిరిగి తీసుకుంటానన్న షరతుతో 2017లో మున్నూరు కాపు సంఘానికి గిఫ్ట్‌డీడ్ చేశాడు. అయితే, గడువు లోపు ఎలాంటి నిర్మాణం చేపట్టకపోవడంతో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన తుప్పా భరత్‌కుమార్‌కు రాజు ఇటీవల ఆ ప్లాటును విక్రయించాడు. భరత్‌కుమార్ తన స్థలంలో ఈనెల 13న నిర్మాణ పనులు చేపట్టడంతో మున్నూరుకాపు సంఘం నాయకులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆరోజు ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపించారు. ఆదివారం మరోసారి పనులు ప్రారంభించగా విషయం తెలుసుకున్న మున్నూరు కాపు సంఘం సభ్యులు చక్రం జంగయ్య, వర్కారి రాము, గందం సత్తయ్య, చక్రం రవీందర్, పగడాల పాండు, పగడాల యాదయ్య, వర్కారి రాజు, గందం అంజనేయులు, పరిధం సురేష్‌లతోపాటు మరికొందరు వ్యక్తులు అక్కడకు చేరుకున్నారు. అక్కడే ఉన్న గందం రాజు, భరత్‌కుమార్‌లపై రాళ్లు, కర్రలు, ఇనుపరాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను వీడియో చిత్రీకరిస్తున్న వర్కారి గణేష్ అనే వ్యక్తిని కూడా గాయపరిచారు. అతడి సెల్‌ఫోన్ ధ్వంసం చేశారు. దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు గందం రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. దాడిలో పాల్గొన్న మరికొందరిని గుర్తించాల్సి ఉందన్నారు.



దాడి చేస్తున్న మున్నూరుకాపు సంఘం సభ్యులు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మిర్యాలగూడ అర్బన్: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన పట్టణంలోని సీతారాంపురంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురంలో నివాసముంటున్న జమీలాబేగం ఇంట్లో శనివారం రాత్రి సార్ట్ సర్క్యూట్ జరిగి సామగ్రికి మంటలు అంటుకున్నాయి. గమనించిన కుటుంబ సభ్యులు ఇంటినుంచి బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. మంటలు ఇంటిని చుట్టిముట్టి వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. స్థానికుల సహాయంతో మంటలను అదుపుచేసిన అనంతరం అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించి తక్షణ సాయంగా రూ.10వేల రూపాయలను అందించారు. ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, నాయకులు పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ సలీం, షేక్ మదార్ బాబా, ఇంజం రాజేంద్రప్రసాద్, ఇమ్రాన్ తదితరులున్నారు.



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు తదితరులు

అర్ధరాత్రి ఇంట్లో అగ్ని ప్రమాదం

సూర్యాపేట క్రైం : పట్టణంలోని విద్యానగర్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్‌తో ఏసీకి మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోగా బెడ్ రూమ్‌లోని మంచాలు, పరుపులు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఇంటి యజమాని కృష్ణ ఒక్కడే ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఏసీ నుంచి మంటలు వస్తుండడాన్ని గమనించి బెడ్ రూమ్ నుంచి బయటపడడంతో ప్రాణాలను దక్కించుకున్నాడు. తాను బయటికి వచ్చాక మంటలతో మంచం పరుపులు దగ్ధమయ్యాయని తెలిపారు. పక్కింటి వారిని అప్రమత్తం చేయడంతో పైపుల ద్వారా నీళ్ల చల్లినా మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి అదుపు చేశారు. విద్యుత్ సిబ్బంది ఇంటికి పవర్ సప్లయ్ బంద్ చేయడంతో ప్రమాదం తప్పింది.

తాస్కానిగూడెం గ్రామస్తుల ఆందోళన విరమణ



బాలిక ఇంటి ఎదుట శివ మృతదేహం

చండూరు : చండూరు మండలం తాస్కానిగూడేనికి చెందిన అబ్బనబోయిన శివ (26) ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు, గూడెం వాసులు మృతదేహంతో అదే గ్రామానికి చెందిన మైనర్ ఇంటి ఎదుట చేపట్టిన ఆందోళనను ఆదివారం రాత్రి విరమించారు. శివ ఇదే గ్రామానికి చెందిన ఓ మైనర్ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ప్రేమ వ్యవహారంలో మైనర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై పోలీసులు విచారణ జరపకుండానే శివ ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి బంధువులు ఆరోపించారు. కారకులపై చర్యలు తీసుకోవాలని శనివారం రాత్రి నుంచి ఆందోళన కొనసాగించారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే, మృతుడి కుటుంబాలతో పోలీసులు చర్చలు జరిపి బాధ్యులపై విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. సోమవారం శివ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం



గీతారాణి (ఫైల్)

కొండమల్లేపల్లి : ఉరేసుకుని ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన ఆదివారం రాత్రి కొండమల్లేపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నాంపల్లి మండలం పావనోనిపల్లి గ్రామానికి చెందిన కడారి గీతారాణి, గిరి దంపతులు ఆరేళ్ల క్రితం కొండమల్లేపల్లికి వచ్చి స్థిరపడ్డారు. భర్త గిరి స్థానిక విద్యుత్ కార్యాలయంలో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, ఆదివారం ఉదయం గీతారాణి వేరుశనగ కూలీకి వెళ్లి సాయంత్రానికి ఇంటికి వచ్చింది. గిరి విధులకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేనిసమయంలో గీతారాణి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన అత్త తలుపులు కొట్టినప్పటికీ తెరవకపోవడంతో అనుమానంతో కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సహాయంతో తలుపులు పగలగొట్టగా అప్పటికే గీతారాణి మృతి చెంది ఉంది. కాగా, గీతారాణి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

కంపచెట్లలో చిక్కుకున్న వృద్ధుడు.. రక్షించిన పోలీసులు

దేవరకొండ : కంపచెట్ల నడుమ చిక్కుకొని బయటికి రాలేక బిక్కుబిక్కుమంటున్న ఓ వృద్ధుడిని దేవరకొండ పోలీసులు స్థానిక యువకుల సహాయంతో రక్షించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుగొమ్ము మండలానికి చెందిన కూరాకుల ముత్తయ్య పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు.ముత్తయ్య భార్య గతేడాది మృతిచెందింది.దీంతో ఇంటి సమీపంలోనే ఉంటున్న ముత్తయ్య తమ్ముడు అతని బాగోగులు చూస్తున్నాడు. కాగా, రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ముత్తయ్య ఆదివారం పట్టణ శివారులోని గాజీనగర్‌కు వెళ్లే మార్గంలో గల కంపచెట్లలో చిక్కుకొని బయటికి రాలేక తీవ్ర అవస్థపడ్డాడు. ఇది గమనించిన స్థానిక యువకులు ఇలియాస్,జానిలు దేవరకొండ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న బ్లూకోట్స్ సిబ్బంది శ్రీధర్, బాలాజిలు జేసీబీ సహాయంతో కంపచెట్లను తొలగించి ముత్తయ్యను వెలికి తీశారు. మాట్లాడలేకపోతున్న అతడిని 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్య చికిత్స అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు దేవరకొండ ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ముత్తయ్య బహిర్భూమికి వెళ్లి కళ్లు సరిగా కనిపించక కంపచెట్లలో చిక్కుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.



ముత్తయ్యను వాహనంలో తరలిస్తున్న 108 సిబ్బంది

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మిర్యాలగూడ: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం దామరచర్ల మండలం బాండావత్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గేరితండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆడావత్ పాశ్య (58) తన ఇంటి ఆవరణలో ఉన్న ఇనుప దండెం తీగకు బట్టలు ఆరవేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పాశ్యను చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రమణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలు ఆదివారం భువనగిరిలో వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రాంనగర్‌లో అద్దెకు నివాసం ఉంటున్న పోలీస్ కానిస్టేబుల్ ఇంట్లో సుమారు రూ. 5 నుంచి రూ. 10 వేల వరకు, ఎల్‌బీనగర్‌లోని రాఘుల రవి ఇంట్లో బంగారంతో పాటు నగదును కలుపుకుని సుమారు రూ.5 లక్షల వరకు దుండగులు శనివారం అపహరించుకుపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాన్‌డబ్బాలో చోరీ

మాదుగులపల్లి: మండల కేంద్రంలోని ఓ పాన్‌డబ్బాలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 15 వేల విలువైన సిగరెట్ ప్యాకెట్లు, పాన్ మసాలా సామగ్రి, రూ.3 వేల నగదు అపహరణకు గురైనట్లు సమాచారం. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు. కాగా ఇటీవల మండల కేంద్రంలో చోరీలు పెరిగాయని స్థానికులు అంటున్నారు. రాత్రివేళ పోలీస్ పెట్రోలింగ్ కరువైందని ఆరోపిస్తున్నారు.

వేసవిలో లాభసాటిగా ఆకుకూరల సాగు

- కోదాడ డివిజన్ ఉద్యానశాఖ అధికారి అనిత

పాడి పంట

నడిగూడెం : ఆకు కూరలు సమీకృత పోషకాహారంలో చాలా ముఖ్యమైనవి. వీటిలో శరీరానికి అవసరమైన ఎన్నో పోషక పదార్థాలు మనకు లభిస్తాయి. రోజు ప్రతి ఒక్కరూ 125 గ్రాముల ఆకు కూరలను ఆహారంలో తీసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని కోదాడ డివిజన్ ఉద్యానశాఖ అధికారి అనిత చెబుతున్నారు. అయితే ఆకు కూరల సాగులో రైతులకు ఇచ్చే సలహాలు, సూచనలు ఆమె మాటల్లోనే .. వేసవిలో అధిక ఉష్ణోగ్రత ఉంటుంది. కొద్దిపాటి మెళకువలు పాటిస్తే ఆకు కూరల సాగుతో అధిక లాభాలు పొందవచ్చు. వేసవిలో తేమ నిలుపు కోగలిగిన బరువైన నల్లభూములు అనుకూలంగా ఉంటాయి. నీటి వసతి ఉంటే ఎర్రనేలలు, ఇసుక నేలలు ఎంపిక చేసుకోవాలి. ఆకు కూర మడులకు తుంపర్ల పద్ధతిలో నీటిని అందించాలి. నీటి సమర్థ వినియోగంతో పాటు ఆకుకూరల మడులను ఎండ తీవ్రత నుంచి కాపాడవచ్చు.

రకాలు : ముఖ్యంగా వేసవి సాగుకు సూచించిన రకాలను ఎంపిక చేసుకుంటే అవి నీటి ఎద్దడిని తట్టుకొని మంచి దిగుబడినిస్తాయి. వేసవి సాగుకు తోటకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమీర, గోంగూర, అనువైనవి.

తోటకూరలో : ఆర్.ఎస్.ఎ–1, అర్కాసుగుణ, పూసాకీర్తి, అర్కాఅరుణ, ఎరుపు

పాలకూరలో : ఆల్‌గ్రీన్, పూసా జ్యోతి, పూసాపాలక్,

మెంతికూర : పూసా ఎర్లీబంచింగ్, లాంసెలక్షన్–1



నడిగూడెం మండలం కరివిరాలలో సాగులో ఉన్న పాలకూర

కొత్తిమీర: సాధన, స్వాతి

గోంగూరలో : ఆంగ్రో–12, లోకల్, ఎర్ర గోంగూర రకాలను ఎంపిక చేసుకోవచ్చు.

విత్తడం

తోటకూర : 900–1000 గ్రాముల విత్తనం 10 కిలోల ఇసుకతో కలిపి ఒత్తుగా చల్లాలి. ఎకరాకు 20 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి. కోత, కత్తిరింపు తర్వాత ఎకరాకు 10కిలోల నత్రజని అందించే ఎరువును వేసి నీరుపెట్టాలి.

పాలకూర : ఎకరాకు 12–15 కిలోల విత్తనం, వరుస వరుసకు 12సెం.మీ, మొక్కకు మొక్కకు మధ్య 10 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి. ఎకరాకు 10కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేయాలి.

మెంతికూర : ఇసుక, మురుగు నీటి వసతి ఉన్న ఒండ్రు నేలల్లో పండించేందుకు అనుకూలం. 10–12 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనాన్ని వెదజల్లవచ్చు, లేదా వరుసలలో నాటవచ్చు. విత్తే ముందు విత్తనాన్ని నీటిలో నానబెట్టి వెదజల్లవచ్చు. ఎకరాకు 10కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేయాలి.

కొత్తిమీర : మురుగు నీటి సౌకర్యం కలిగిన బంకనేలలు అనుకూలం. విత్తే ముందు గింజలను రెండు బద్దలుగా చేయాలి. విత్తనాన్ని వెదజల్లడం లేదా వరుసలలో వేయాలి. ఎకరాకు 5–6 కలోల విత్తనాన్ని 15 సెం.మీ. ఎడంతో విత్తుకోవాలి. ఎకరాకు 4కిలోల నత్రజని, 10 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేయాలి.

ఎరువుల యాజమాన్యం

బాగా దుక్కి చేసిన నేలలో ఆఖరి దుక్కిలో ఎకరాకు 10–15 టన్నుల పశువుల ఎరువు 200 కిలోల వేప పిండి వేసి కలియదున్నాలి. వీలేనంత ఎక్కువ మోతాదులో సేంద్రియ ఎరువులు వాటితో పాటు జీవన ఎరువులు వాడితే మంచి ఫలితం ఉంటుంది. సేంద్రియ ఎరువుల వాడకం వలన నేల గుల్లబారి ఎక్కువ రోజులు తేమ నిల్వ ఉంటుంది. రెండు వరుసల మధ్య వరిగడ్డి, వేరుశనగ పొట్టు ఎండుటాకులు పరిస్తే నేలలో తేమ సంరక్షించబడును. ఆకు దిగుబడి పెంచడానికి 2శాతం యూరియా (20 గ్రాములు లీటరు నీటికి) జిబ్బరెల్లిక్ ఆమ్లం 50 మి.గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది.

సస్యరక్షణ చర్యలు

ఆకుకూరలను కూరగా వాడతారు కనుక వీలైనంత వరకు పురుగు మందులను వాడకపోవడమే మంచిది. వేప సంబంధిత పురుగు మందులను మాత్రమే వాడాలి. ముఖ్యంగా రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు పురుగుల నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి కార్బెండాజిమ్ 1 గ్రాము లేదా మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

గోంగూర : ఎకరాకు 6–8 కిలోల విత్తనాన్ని 60 సెం.మీ. ఎడంగా తయారు చేసుకున్న బోదెలో 30 సెం.మీ. దూరంలో వరుసలో విత్తుకోవాలి. ఎకరాకు 6కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేసుకోవాలి.

నీటి యాజమాన్యం

ఆకుకూరలు విత్తిన వెంటనే నీరు పెట్టాలి. మళ్లీ మూడో రోజు నీరు పెట్టి నేల స్వభావాన్ని బట్టి తేలిక నేలలో 5–6 రోజుల వ్యవధిలో, బరువు నేలలో 8–10 రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలి. తోటకూర విత్తిన తర్వాత నెమ్మదిగా నీటిని పారించాలి. లేకపోతే నీటితో విత్తనం కొట్టుకపోయి మొలకశాతం తగ్గుతుంది. ఆకు కూరల్లో దిగుబడి ముఖ్యంగా వేసవిలో నీటి యాజమాన్యంపైనే ఆధారపడి ఉంటుంది. ప్రతి కోత తర్వాత పైపాటు ఎరువులు చల్లి నీరు పెట్టాలి.

కలుపు నివారణ : అన్ని ఆకుకూరల పంటల్లో కలుపు నివారణకు పెండిమిథాలిన్ ఎకరాకు 1.2 లీటర్ల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 14 గంటల్లో పిచికారీ చేసి, 30 రోజుల వరకు కలుపు నివారించవచ్చు.